## క్లుప్తంగా

### ఎక్స్‌గ్రేషియా అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన కోట భూమేశ్వర్ గత నెలలో దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నారై పాలసీలో భాగంగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సోమవారం వారి ఖాతాలో జమ చేసినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకున్న టీఎస్‌ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: ఈనెల 31వ వరకు ప్రతిఒక్కరు ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్‌కు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాజు కోరారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని పలు దుకాణాల్లో అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31 వరకు 100 శాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతున్నామని అన్నారు. వాణిజ్య సముదాయాల బాకీల విషయంలో అవసరమైతే సీజ్ చేయాలని బిల్ కలెక్టర్లకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది దత్తారెడ్డి, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాక్లూర్: మదన్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల నిధులు మంజూరు కావటంతో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులు ప్రారంభించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. నాయకులు ఎనుగంటి శంకర్‌గౌడ్, రాస మహేష్, బస్వయ్య, లచ్చన్న, నాచూర్, మహబూబ్, రమేష్, బోజన్న, జనార్దన్, బాబు పాల్గొన్నారు.

### ధ్రువపత్రాల పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): దివ్యాంగుల పునరావాస పథకం క్రింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాన్ బ్యాంక్ లింకేజీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న పట్టణ పరిధిలోని దివ్యాంగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్ సెట్స్ తీసుకొని మంగళవారం ఉదయం 11:30 గంటలకు బల్దియా కార్యాలయానికి రావాలని సూచించారు.

### సాగర్ కాల్వలో పూడికతీత

రెంజల్(బోధన్): మండలంలో చివరి ఆయకట్టు గ్రామమైన నీలాకు సాగు నీరందించే సాగర్ కాల్వలో పేరుకుపోయిన పూడికను సోమవారం జేసీబీతో తొలగించారు. సాటాపూర్ జగదాంబ రైస్‌మిల్ నుంచి కందకుర్తి ఎత్తిపోతల వరకు గల డి–52/2 కాల్వలో పూడిక పెరిగి చివరి ఆయకట్టుకు నీరందక పోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులను ఆదేశించడంతో పూడికతీత పనులను చేపట్టారు. నాయకులు దగ్గరుండి కాల్వలో పేరుకుపోయిన పొదలు, మట్టి పనులను చేయించారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు గంగాకృష్ణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎల్ రాజు, తదితరులున్నారు.

### అంగన్‌వాడీలకు అండగా ఉండాలి

బాల్కొండ: జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెకు ముప్కాల్ మండల టీచర్లు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల మండల అధ్యక్షులు వసంత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయటానికి పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీ టీచర్లకు అండగా ఉండాలని కోరారు.

### శబ్ద కాలుష్యం సృష్టిస్తే కఠిన చర్యలు

ఆర్మూర్‌టౌన్: వాహనాల ద్వారా కావాలని శబ్ద కాలుష్యం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణాన్ని ఏసీపీ సోమవారం సందర్శించగా.. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు ఆ సమయంలో ఏసీపీని కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లు బిగించి రోడ్లపై వచ్చి కాలుష్యం సృష్టిస్తే వాహనదారులను అదుపులో తీసుకుంటామన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్, సెక్రటరీ రాస ఆనంద్, మానస గణేష్, ఖాందేష్ సత్యం, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన ఎక్కడ..?

- వైద్య సిబ్బంది వచ్చిందే వేళ..
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ఉదయం 10 గంటల వరకు ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు కుర్చీ



ఉదయం 9.50 గంటలకు ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ కుర్చీ

బాల్కొండ: మెండోరా పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. పీహెచ్‌సీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలి. కాని ఉదయం 10 గంటలు దాటినా పూర్తి స్థాయిలో సిబ్బంది రాలేదు. ఉదయం 9.51 నిమిషాలకు ల్యాబ్ టెక్నీషియన్ ఆస్పత్రిలోకి ప్రవేశించారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టులు పని చేస్తున్నారు. కాని ఒక వైద్యురాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కిసాన్‌నగర్ పీహెచ్‌సీ వైద్యురాలికి ఇన్‌చార్జి బాధ్యత అప్పగించారు. ఆయుష్ విభాగంలోని మరో వైద్యురాలు 10 గంటలు దాటినా హాజరు కాలేదు. స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు తీరిగ్గా 10.30 గంటల తరువాత వచ్చారు. ఓ వైపు ఉన్నతాధికారులు సమయ పాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచిస్తున్నారు. కాని క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. వేసవి కాలం కావడంతో ఉదయం 9 గంటలు దాటితేనే భానుడు భగ భగ మండిపోతున్నాడు. ఉదయం ఆస్పత్రికి వచ్చినా వారికి నిరాశ తప్పడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు వచ్చిందే వేళ అన్నట్లుగా తయారైంది.

**చర్యలు తీసుకుంటాం**

వైద్యులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలి. అలా పాటించకుంటే చర్యలు తప్పవు. త్వరలోనే పూర్తి స్థాయి వైద్యులు కూడా వచ్చే అవకాశం ఉంది. సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రమేశ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, ఆర్మూర్

## ఆధ్యాత్మికం..

### శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు.

### ఇంటింటికి శ్రీరామ నవమి కల్యాణ తలంబ్రాలు



ఆర్మూర్‌టౌన్ : శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్‌టీసీ) ప్రత్యేక ఆఫర్ ప్రకటించందని ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. డిపో కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఏప్రిల్ 6న భద్రాద్రి సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలను రూ.151 చెల్లిస్తే మీ ఇంటివద్దకే పొందే అరుదైన అవకాశాన్ని ఆర్టీసీ కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ సేవను కార్గో సర్వీస్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్, సిబ్బంది పాల్గొన్నారు.

### సేవాలాల్, జగదాంబదేవి ఆలయ వార్షికోత్సవం



బాల్కొండ: మెండోరా మండలం నడిమి తండాలో సోమవారం సంత్ సేవాలాల్, జగదాంబ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

### ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సీఐ ఓడీ రమేష్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి చౌరస్తా వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్సై రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు తైబజార్ వేలం

బాల్కొండ: మండల కేంద్రంలో జీపీ ఆధ్వర్యంలో బుధవారం తైబజార్ వేలం (2025–26) నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గురువారం నిర్వహించే వార సంతకు డిపాజిట్ రూ. 50 వేలు, రోజువారి సంతకు డిపాజిట్ రూ.35 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఉదయం 10.30 గంటలకు జీపీ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామని చెప్పారు.

### సువర్ణాదేవికి నివాళులు

మోర్తాడ్ : నిజాం కళాశాల మాజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ నాయుడు అశోక్ సతీమణి సువర్ణాదేవి (58) సోమవారం తెల్లవారుజామున మృతి చెందగా.. ఆమె మృతదేహానికి మంత్రి సీతక్క నివాళులర్పించారు. ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన నాయుడు అశోక్ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తూనే నిజాం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఆయన భార్య గుండెపోటుతో మరణించగా ఆమె అంత్యక్రియలు తొర్తిలో నిర్వహించారు. అంతకు ముందే హైదరాబాద్‌లోని అశోక్ స్వగృహంలో పలువురు నివాళులర్పించారు.

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

కమ్మర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఈవో అశోక్ సూచించారు. సోమవారం కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్, చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు చాలామంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని తెలియజేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని పట్టుదలతో చదివాలన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం మధుపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు నస్రీమా బేగం, కమల, వీడీసీ అధ్యక్షుడు సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న పట్టణ సీఐ నారాయణ

బోధన్‌టౌన్(బోధన్): యువత మత్తు పదార్థాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, ఇది మంచి పరిణామం కాదని, జాగ్రత్తగా ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. నెహ్రూ యువకేంద్రం, సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. నేటి యువత టెక్నాలజీని మంచి పనుల కోసం కాకుండా చెడుకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్ బాగుండాలంటే విద్యపై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్, సాయి ఆదర్శ యువతి మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్ బ్రేకర్ ఏర్పాటు



మోర్తాడ్: విద్యుత్ లోడ్ పెరిగి తరుచూ అంతరాయం ఏర్పడుతుండటంతో వేసవిలో ఎలాంటి సమస్య ఉండకూడదని యాక్షన్ ప్లాన్‌ను విద్యుత్ అధికారులు అమలు చేశారు. మోర్తాడ్‌లో టౌన్ ఫీడర్‌పై భారం ఏర్పడకుండా ఉండటానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను, దొన్కల్‌లో వ్యవసాయానికి, గ్రామానికి వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేసేందుకు బ్రేకర్‌ను ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. రూ.10.50 లక్షల ఖర్చుతో రెండు చోట్ల విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ఏడీఈ వినోద్, జేఈ రమేష్‌లు 'సాక్షి'కి వెల్లడించారు. ఆర్మూర్ డీఈ పీవీ రాజేశ్వర్‌రావు, టెక్నికల్ ఏఈ లక్ష్మణ్‌లు బ్రేకర్, ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి చార్జి చేయించారు.


# ఈజీఎస్ పనులపై లీగల్ నోటీసులు

రుద్రూర్: కోటగిరి, పోతంగల్ మండలాల్లో ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించకుండా ఉపాధి హామీ పనులను చేస్తున్నారని పేర్కొంటూ... సంబంధిత అధికారులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు లీగల్ నోటీసులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాసరావ్ హైకోర్టు న్యాయవాది ద్వారా నోటీసులను పంపారు. ఉపాధి హామీ నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ఆమోదం తెలిపి తీర్మానాలను అందించిన తర్వాతే పనులను ప్రారంభించాల్సి ఉండగా నిబంధనలకు పాటించకుండా పనులెలా చేస్తున్నారని లీగల్ నోటీసులో ప్రశ్నించారు. ఈ లీగల్ నోటీస్ ప్రతులను సోమవారం కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు కోటగిరి జీపీ, తహసీల్ కార్యాలయంలో అందజేశారు.


# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చేంత వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరసన దీక్షలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. గత పదిరోజులుగా వివిధ మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరసన దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని కోరారు. చట్టబద్ధత కల్పించే వరకు నిరవధిక దీక్షలు కొనసాగుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారని ఆరోపించారు.

– సాక్షి నెట్‌వర్క్



సాలూర మండల కేంద్రంలో దీక్షలో కూర్చుకున్న ఎమ్మార్పీఎస్ నేతలు ..



మాక్లూర్‌లో..

### ప్రమాదమని తెలిసినా..

మెట్లపై బట్టలు ఉతుకుతున్న మహిళలు



బాల్కొండ: మెండోరా మండల కేంద్రం గుండా ప్రవహించే కాకతీయ కాలువ వద్ద ప్రమాదమని తెలిసినా కొందరు మహిళలు బట్టలు ఉతుకుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాలువ ప్రవాహం వేగంగా ఉంటుంది. అయినా మహిళలు కాలువలో మెట్లపై బట్టలు ఉతుకుతున్నారు. ప్రమాదవశత్తూ కాలువలో జారి పడితే అంతే సంగతులు. కాలువ వద్దకు మహిళలు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నాలుగు ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయుడు

- రాసిన ప్రతి పోటీ పరీక్షలో ఉద్యోగం సాధించిన హరీష్
- పోచంపాడ్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడి ఘనత



హరీష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాల్కొండ: తాను రాసిన ప్రతి పోటీ పరీక్షలో సత్తా చాటి ఉద్యోగం సాధించాడు మోర్తాడ్ మండలానికి చెందిన సుద్దాల హరీష్. 2017లో పీజీటీ, టీజీటీగా ఎంపికయ్యాడు. మెండోరా మండలం పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే 2024లో గురుకుల జూనియర్ లెక్చరర్‌గా.. అనంతరం 2025లో టీఎస్‌పీఎస్సీ జూనియర్ లెక్చరర్(జేఎల్)కు సన్నద్ధమై తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. తోటి ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్, పీడీ సంజీవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బైపాస్ రోడ్డు అంచు గుంతల పూడ్చివేత

**సాక్షి ఎఫెక్ట్..**



సాలూర క్యాంప్ వద్ద మొరం పోసిన అనంతరం రోడ్డు అంచు

బోధన్ : బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8 కిలో మీటర్ల పొడువున నాలుగు వరుసల అంతర్రాష్ట్ర విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బోధన్, సాలూర మండలంలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులో 4 కిలో మీటర్ల పొడవున బైపాస్ రోడ్డును నిర్మించారు. సాలూర క్యాంప్, నాగన్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు అంచున వేసిన మొరం వర్షానికి కొట్టుకు పోయి ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు ప్రమాదకరంగా ఉన్న పరిస్థితిపై ఈ నెల 10న సాక్షి దినపత్రికలో **బాబోయ్ బైపాస్ రోడ్డు శీర్షికన కథనం** ప్రచురితమైంది. ఈ కథనానికి నేషనల్ హైవే అధికారులు స్పందించారు. సోమవారం బైపాస్ రోడ్డు అంచు గుంతలను బ్లేడ్ ట్రాక్టర్‌తో పూడ్చివేయించా రు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు, భారీ గుంతలు ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బో ర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### కొత్త వంతెన మీదుగా రాకపోకలు



రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

బోధన్: బోధన్ పట్టణ శివారు నాగన్‌పల్లి గ్రామ సమీపంలో పసుపు వాగుపై నిర్మించిన హైలెవల్ కొత్త వంతెన మీదుగా రెండు రోజులుగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వంతెనపై భాగం స్లాబ్, సైడ్ వాల్స్ పూర్తికాగా, వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తికాకపోయినా ద్విచక్ర వాహనదారులు, చిన్నచిన్న వాహనాలు వెళ్తున్నాయి. వంతెన వద్ద బీటీ పనులు పూర్తి కావాల్సి ఉంది. వంతెన వద్ద బ్యారికేడ్లు తొలగించడంతో వాహనదారులు దూసుకుపోతున్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ రాజిరెడ్డి

రెంజల్(బోధన్): జిల్లాలోని శాఖా గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి సూచించారు. సోమవారం రెంజల్‌లో రూ.32.50 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం అద్దె భవనంలో కొనసాగుతున్న శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చిన యువకులతో ఆయన ముచ్చటించారు. ఎలాంటి పుస్తకాలు కావాలని అడిగి తెలుసుకున్నారు. రెంజల్‌లో నిర్మిస్తున్న భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల చివరి వరకు తమకు అప్పగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట సాయిబాబాగౌడ్, జావిదొద్దిన్, కృష్ణ తదితరులున్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | యుగానికి ఒక్కడు (తెలుగు)-10.50, 7.05 ల్యాంప్(తెలుగు)-1.55 1000 వాలా(తెలుగు)-4.20 ఛావా(హిందీ)-10.10 |
| స్క్రీన్-2 | ఛావా(తెలుగు)-11.30, 2.50, 6.10, 9.30 |
| స్క్రీన్-3- | దిల్‌రూబా (తెలుగు) - 10.15, 1.25, 7.30, 10.40 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-4.35 |
| స్క్రీన్-4 | కోర్ట్(తెలుగు)-10.00, 1.05, 4.10, 7.15, 10.20 |

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | దిల్‌రూబా(తెలుగు) - 11.00, 4.35, 7.30, 10.25 ఛావా(హిందీ)-1.40 |
| స్క్రీన్-2 | యుగానికి ఒక్కడు -11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30 |
| స్క్రీన్-3 | ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.30, 7.30 ఛావా(తెలుగు)-4.30, 10.20 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40 |
| స్క్రీన్-2 | కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50 |
| స్క్రీన్-3 | ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45 |
| స్క్రీన్ -4 | దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25 |
| లలితామహల్ | కోర్ట్ (తెలుగు)-11.00, 2.00, 6.00 10.00 |
| దేవి | దిల్‌రూబా(తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00 |
| నటరాజ్ | యుగానికి ఒక్కడు (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00 |
| విజయ్ | ఛావా (తెలుగు)-10.30, 2.15, 6.10, 10.05 |

### మాంసం ధరలు(రూ..)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 140 |
| | | లైవ్ | 90 |
| స్కిన్‌లెస్ | 160 | మటన్ | 800 |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 88,900 | వెండి(కిలో) | 1,03,000 |
| 22 క్యారెట్స్ | 82,047 | | |

– నిజామాబాద్ బిజినెస్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899